సాక్షి
రాజన్న సిరిసిల్ల

భానుడు @44.6

- గంభీరావుపేటలో అత్యధికం

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా శనివారం ఎండలు మండిపోయాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోయి వడగాలులు వీచాయి. ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడ్డారు. అత్యధికంగా గంభీరావుపేటలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. వీర్నపల్లిలో 43.5, పెద్దూరు, ఇల్లంతకుంటల్లో 43.3, సిరిసిల్లలో 43.1, రుద్రంగిలో 42.8, మరిగడ్డ, ఎల్లారెడ్డిపేటల్లో 42.7, బోయినపల్లిలో 42.6, వట్టెంలలో 42.3, నాంపల్లిలో 42.2, మానాలలో 42.0, మర్తనపేటలో 41.9, మల్లారంలో 41.8, కందికట్కూర్‌లో 41.7, నేరెళ్లలో 41.6, గజసింగారంలో 41.5, నామాపూర్‌లో 41.4, నిజామాబాద్‌లో 41.1, ఆవునూర్‌లో 41.0, పెద్దలింగాపూర్‌లో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని సీపీవో పీబీ శ్రీనివాసచారి తెలిపారు.



ఆదివారం | 2 | జూన్ | 2024

పదేళ్ల ప్రగతిబాట

- రాజన్నసిరిసిల్ల జిల్లా ఆదర్శపథం
- జిల్లాలో విరబూసిన ప్రగతికాంతులు
- నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

సిరిసిల్ల: స్వరాష్ట్ర సాధన కోసం ముక్కోటి గొంతుకలు.. సబ్బండవర్ణాలు ఏకమైన నినదించాయి. దశాబ్దాల పోరాటం... ప్రజల ఆరాటం ఫలించింది. భాష, యాసలు.. పాటలతో సాగిన ఉద్యమం విజయతీరాలకు చేరింది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి నేటికి పదేళ్లు అవుతుంది. స్వరాష్ట్రంలో ఆత్మగౌరవ పతాక రెపరెపలాడింది. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త జిల్లాల ఏర్పాటయ్యాయి. 2016లో రాజన్నసిరిసిల్ల జిల్లా ఆవిర్భవించింది. స్వరాష్ట్రంలో కొత్త జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంతంలో వెలుగురేఖలు విస్తరించాయి. దశాబ్దాల కాలంగా అభివృద్ధికి దూరంగా ఉన్న పల్లెలు ప్రగతి పథంలో పయణిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజన్నసిరిసిల్ల జిల్లా అభివృద్ధిపై కథనం...

చిన్న జిల్లా.. పెద్ద అభివృద్ధి

రాష్ట్రంలో వైశాల్యం... జనాభా పరంగా రాజన్నసిరిసిల్ల జిల్లా చిన్నది. 13 మండలాలు, రెండు మున్సిపాలిటీలతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటైంది. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలతోపాటు ఇల్లంతకుంట(మానకొండూరు), బోయినపల్లి(చొప్పదండి) మండలాలు ఉన్నాయి. జిల్లాలో 255 గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు 5,55,037 మంది జనాభాతో 2019 చదరపు కిలోమీటర్లతో విస్తరించి ఉంది. సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్నారు. గత పదేళ్లుగా కేటీఆర్ జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తూ.. నిధులు మంజూరు చేశారు. కేటీఆర్ చొరవతో జిల్లాలో అభివృద్ధి పల్లవించింది. కలెక్టరేట్ భవన నిర్మాణం పూర్తయింది. జిల్లా పోలీస్ అధికారి ఆఫీస్ భవనం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. సిరిసిల్ల పట్టణంలో రోడ్ల విస్తరణ, వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు జరిగాయి. చిన్న జిల్లా అయినా అభివృద్ధిలో అగ్రపథాన నిలుస్తోంది. సిరిసిల్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తారు రోడ్లు పూర్తయ్యాయి. వీధి వీధికి సిమెంట్ రోడ్లు వేశారు. కొత్తగా 56 గ్రామపంచాయతీలు ఆవిర్భవించాయి. స్వచ్ఛ భారత్‌లో జిల్లా ఆదర్శంగా ఉంది. ఉపాధిహామీలో ముందుంది. వంద శాతం పన్నుల వసూళ్లు, వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం వంటి సామాజికాంశాల్లోనూ జిల్లా అగ్రపథాన నిలిచింది. జిల్లాలో చేపట్టిన జలసంరక్షణ పనులతో భూగర్భ జలాలు బాగా అభివృద్ధి చెంది.. శిక్షణ ఐఏఎస్‌లకు జిల్లా జలసిరులు పాఠ్యాంశంగా మారింది. ఇలా చిన్న జిల్లాలో ఎన్నో ఆదర్శ విధానాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. గత ఆరునెలలుగా కరువు పరిస్థితులతో జలాశయాల్లో నీరు కరువైంది. నీటివనరులు ఎండిపోయాయి. జిల్లాలో భూగర్భ జలాలు మళ్లీ అడుగంటిపోయాయి.



కొండా లక్ష్మణ్‌బాపూజీ జంక్షన్

పెరిగిన సాగు విస్తీర్ణం

జిల్లాలో సాగువిస్తీర్ణం రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బాగా పెరిగింది. వ్యవసాయం పండుగలా సాగుతోంది. మధ్యమానేరు జలాశయం నిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగాయి. సిద్దిపేట జిల్లా కూడవెల్లి వాగు ద్వారా గంభీరావుపేట మండలం నర్మాల మానేరు జలాశయంలోకి గోదావరి జలాలు చేరాయి. ఎండాకాలంలోనూ ఎగువమానేరు మత్తడి దూకింది. ఈ ఏడాది యాసంగి సీజన్‌లోనూ ఆయకట్టుకు నీరు అందించారు. ఇది చారిత్రాత్మకం. జిల్లాలో రికార్డు స్థాయిలో ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడులను రైతులు సాధించారు. జిల్లాలో వ్యవసాయ అభివృద్ధికి సర్కారు దన్నుగా నిలుస్తోంది. వ్యవసాయాభివృద్ధికి 10 గోదాములు నిర్మించారు. చెరువులు, కుంటల అభివృద్ధికి రూ.96.09కోట్లు కేటాయించారు. మిషన్‌భగీరథలో రూ.1,220 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించే పనులు చేపట్టారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్యాకేజీ-9లో భాగంగా రూ.1,280కోట్లతో మధ్యమానేరు నుంచి ఎగువ మానేరుకు ఎత్తిపోతల పథకం టన్నెల్ పనులు పూర్తయ్యాయి. మొత్తంగా సిరిసిల్ల నియోజకవర్గంలోని లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో పనులు చేస్తున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఎక్కువ సంఖ్యలో చేపట్టారు. వేములవాడ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయి. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గుడి చెరువు అభివృద్ధి పనులు సాగుతున్నాయి. కోనరావుపేట మండలం మల్కపేట వద్ద మూడు టీఎంసీల నిల్వ సామర్థ్యం గల జలాశయం పూర్తయింది. ప్రస్తుతం ఒక్క టీఎంసీ నీరు నిల్వ ఉంది. గోదావరి జలాలు జిల్లాకు చేరాయి. ఇప్పటికే ఎల్లంపల్లి జలాలు వేములవాడ మండలంలోని కొన్ని గ్రామాలకు చేరాయి.



పవర్‌లూమ్స్

విద్య, వైద్యరంగాల్లో...

జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు కావడంతో వైద్యరంగంలో గణనీయమైన ప్రగతి సాధించింది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యను వంద మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి సేవలు భేష్‌గా ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్-క్వాష్ గుర్తింపు లభించింది. మరోవైపు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు కావడంతో అగ్రహారంలో కొనసాగుతోంది. సిరిసిల్ల శివారులోని సర్దాపూర్‌లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వద్ద వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే తొలి కేజీ టు పీజీ విద్యాలయం గంభీరావుపేటలో ఉంది.

చిన్నాభిన్నమైన వస్త్రోత్పత్తి రంగం

సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో ఎన్నడూ లేని మార్పులు వచ్చాయి. 2017 నుంచి ప్రభుత్వం ఆర్వీఎం, బతుకమ్మ చీరలు, క్రిస్మస్, రంజాన్ వస్త్రోత్పత్తి ఆర్డర్లతో నేతన్నలకు చేతినిండా పని దొరికింది. గతేడాది రూ.350కోట్ల ప్రభుత్వ ఆర్డర్లు సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు లభించాయి. దీంతో కార్మికులకు ప్రతీ నెల మెరుగైన వేతనాలు వచ్చేవి. ఆసాములకు, యజమానులకు ఉపాధి లభించింది. 1,104 మంది కార్మికులను యజమానులుగా మార్చేందుకు రూ.202.30 కోట్లతో 80 ఎకరాల్లో సామూహిక వర్క్‌షెడ్లు నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం వస్త్రోత్పత్తి ఆర్డర్లను ఇచ్చి సిరిసిల్ల నేతన్నలకు మెరుగైన ఉపాధి చూపాలని నిర్ణయించింది. ఈమేరకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు ఇప్పటికే ప్రకటనలు చేశారు. ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు వస్తే.. నేతన్నలకు చేతి నిండా లభిస్తుంది.

రహ'దారుల' అభివృద్ధి

జిల్లాలో పంచాయతీరాజ్ పరిధి(పీఆర్)లో రూ.525.61కోట్లతో 825.22 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వివిధ గ్రామాల్లో వేశారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో రూ.391.04 కోట్లతో 28 రోడ్లను, మరో నాలుగు వంతెనలు నిర్మించారు. ఇంకా కొన్ని పనులు నిర్మాణంలో ఉన్నాయి. మట్టిరోడ్లు తారు రోడ్లుగా మారాయి. సింగిల్‌రోడ్లు డబుల్ రోడ్లు అయ్యాయి. సిరిసిల్లలో రూ.79కోట్లతో రోడ్లను విస్తరించారు. పట్టణ రోడ్లను సుందరీకరించారు. రెండో బైపాస్ రోడ్డు రగుడు నుంచి వెంకటాపూర్ వరకు రూ.90కోట్లతో పూర్తయింది. వేములవాడ నియోజకవర్గం పరిధిలోని రుద్రంగి, కోరుట్ల రోడ్డు డబుల్ రోడ్డుగా మారింది. సిరికొండ-వేములవాడ రోడ్డు కొంత మేరకు డబుల్ రోడ్డు అయింది. సిరిసిల్ల-మరిమడ్ల రోడ్డు డబుల్ రోడ్డుగా మారింది. ఇలా జిల్లాలో అన్ని ప్రధాన రహదారులు పూర్తయ్యాయి. చెక్‌డ్యాంలతో కూడిన వంతెనలు నిర్మించారు. జిల్లాలో రహదారులు బాగుపడ్డాయి.

జిల్లాలో చేయాల్సిన పనులు

- ఎగువమానేరుకు మధ్యమానేరు నీరు చేరాలి.
- జిల్లాలోని 625 చెరువుల్లోకి గోదావరి జలాల మళ్లింపు.
- వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు.
- సిరిసిల్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల.
- సిరిసిల్లలో నేతన్నలకు యారన్ డిపోల ఏర్పాటు.
- టెక్స్‌టైల్ రంగంపై యువతకు శిక్షణ కేంద్రం ఏర్పాటు.
- వేములవాడ పట్టణంలో రోడ్ల విస్తరణ.
- బీడీకార్మికులకు ఈఎస్ఐ ఆస్పత్రి భవనం నిర్మాణం.
- మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణం.
- నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు.
- వేములవాడ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు పూర్తి.
- వేములవాడ పట్టణంలో రోడ్ల విస్తరణ.



వేములవాడలోని మూలవాగుపై వంతెన




తంగళ్లపల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం



జిల్లెల్లలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం



విద్యుత్‌కాంతుల్లో కలెక్టరేట్



సిరిసిల్ల శివారులోని మధ్యమానేరు బ్యాక్‌వాటర్

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు



సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ అనురాగ్ జయంతి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించి ప్రసంగిస్తారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు జిల్లా యంత్రాంగం శనివారం ఏర్పాట్లు చేస్తుంది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్టు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- పలు దుకాణాలలో తనిఖీ



సిరిసిల్లక్రైం: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా శనివారం పలు ఫర్టిలైజర్, విత్తన విక్రయ దుకాణాల్లో ఎస్పీ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గతంలో నకిలీ విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.


ఆర్యవైశ్యుల పాత్ర గొప్పది

- ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్



వేములవాడ: సమాజంలో ఆర్యవైశ్యులకు ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్యాన్నసత్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆర్యవైశ్య సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు



సిరిసిల్ల: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో శనివారం విద్య, వైద్యశాఖ అధికారులతో పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈనెల 3 నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిరిసిల్లలోని వెంకంపేట జెడ్పీ స్కూల్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రం వద్ద తాగునీరు, టాయిలెట్లు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. డీఈవో రమేశ్‌కుమార్, వైద్యశాఖ అధికారి నయీమ్ జహా, కలెక్టరేట్ పర్యవేక్షకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

బడిబాటకు బ్రేక్

- మళ్లీ షెడ్యూల్ ప్రకటించే అవకాశం
- డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలకు ఏటా నిర్వహించే బడిబాట ముందుగా అనుకున్నట్లు ఈనెల 3 నుంచి ప్రారంభించాలని ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ వెల్లడించింది. కానీ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు, ఇంకా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో బడిబాట కార్యక్రమానికి బ్రేక్ పడినట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. పాఠశాలల పునర్ ప్రారంభానికి ముందుగా కార్యక్రమాల నిర్వహణ ఉంటుందన్న రాష్ట్ర విద్యాశాఖ నుంచి లిఖితపూర్వక ఆదేశాలు వస్తే ప్రవేశాల కోసం బడిబాట నిర్వహిస్తామని తెలిపారు.



అంజన్న మూలవిరాట్టు



దర్శనానికి బారులుతీరిన మాలధారులు



ఆలయంలోకి వస్తున్న స్వాములు

కొండంతా భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు పరిసరాలు శ్రీరామ జయరామ జయజయరామ నామసర్మణతో మారుమోగాయి. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. యాగశాలలో తిరుమంజనం, ద్రవిడ, ప్రబంధపారాయణం, హవణం, పంచామృత అభిషేకం, సహస్ర నాగవలి అర్చన, తులసీదలాల హోమం నిర్వహించారు. దాదాపు రెండు లక్షల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దర్శనం, మాల విరమణకు మూడు గంటల సమయం పట్టింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం అర్ధరాత్రి వరకు ఎడతెరిపి లేకుండా రద్దీ కొనసాగింది. అంజన్నకు జిల్లా వైశ్య సంఘం నాయకులు పోచమల ప్రవీణ్‌కుమార్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. సికింద్రాబాద్‌కు చెందిన నేత కార్మికులు వారం రోజులుగా మగ్గంపై ప్రత్యేకంగా నేసిన వస్త్రాలను స్థానిక హరిత హోటల్ నుంచి శోభాయాత్రగా తీసుకెళ్లి స్వామికి సమర్పించారు.

డీపీవో ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

సిరిసిల్ల: డీపీవో ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు జారీ చేశారని డీపీవో వీరబుచ్చయ్య శనివారం తెలిపారు. జిల్లా పంచాయతీ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే మందాటి శ్రీశైలం మార్చి 30 నుంచి విధులకు రావడం లేదని డీపీవో తెలిపారు. సెలవు పెట్టకుండా విధులకు రాకపోవడంపై మెమో జారీచేసినట్లు తెలిపారు. విధులకు హాజరుకాకుండా ఉన్న మందాటి శ్రీశైలంను కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు డీపీవో తెలిపారు.

అర్బన్ అభ్యర్థుల 'గుర్తు'ల ప్రచారం


- ఓటర్ల వద్దకే అభ్యర్థులు

సిరిసిల్ల: సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు గుర్తులతో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తికాగానే ఎన్నికల అధికారి టి.రామకృష్ణ పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. తమకు కేటాయించిన గుర్తును ఓటర్ల వద్దకు తీసుకెళ్లేందుకు అభ్యర్థులు శనివారం ప్రచారం చేపట్టారు. మరోవైపు సోషల్ మీడియా వేదికగా పోస్టర్లు పెడుతున్నారు. పరిమిత ఓటర్లు ఉండడంతో ప్రతి ఓటరును కలిసేందుకు అభ్యర్థులు ఆరాటపడుతున్నారు. పార్టీ రహితంగా సాగే అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో పార్టీ సహితంగా ప్యానళ్లు ఏర్పాటయ్యాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ఎవరికి వారు అర్బన్ బ్యాంకు ఎన్నికల బరిలో అభ్యర్థులను పోటీకి నిలిపారు. జూన్ 6న జరిగే ఎన్నికలకు గుర్తులతో అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు ఓటర్ల వద్దకు వెళ్తున్నారు.

జిల్లాలోని సహకార సంఘాలకు ఎన్నికలు

- జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు

సిరిసిల్ల: జిల్లాలోని సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీకి పంపించాలని జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు శనివారం కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు 127 మత్స్య సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయని, ఇంకా 10 సంఘాలకు జరగాల్సి ఉందన్నారు. ఎన్నికల కాలపరిమితి ముగిసిన గొర్రెల పెంపకందారుల సంఘాలు, గీతకార్మికుల సహకార సంఘాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని డీసీవో కోరారు. జూన్ 6న సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. అన్నపూర్ణ మహిళా సంఘం, 17వ పోలీస్ బెటాలియన్ ఉద్యోగుల పరపతి సంఘం ఎన్నికలకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు.



బుద్ధనాయుడు

నకిలీ ఏజెంట్ వివరాలపై ఆరా

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్లక్రైం: మాల్టా దేశానికి పంపిస్తానని పలువురిని మోసం చేసిన సిద్దిపేట జిల్లాకు చెందిన శ్రీనివాస్‌పై చర్యలకు పోలీసులు కసరత్తు ప్రారంభించారు. 'మాల్టా పేరిట మోసం' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. సిరిసిల్లలోని కృష్ణహరిని కలిసి వివరాలు సేకరించారు. నకిలీ ఏజెంటు మాటలు విని డబ్బులు చెల్లించిన వారి వివరాలు తీసుకున్న పోలీసులు ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. చట్టపరిధిలో చర్యలకు వెళ్తామని పోలీసులు భరోసా ఇచ్చినట్లు కృష్ణహరి వెల్లడించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



అథ్లెటిక్స్ పోటీల్లో రాణించిన విద్యార్థులతో నిర్వాహకులు

సిరిసిల్లకల్చరల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 30 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు బొజ్జ చంద్రశేఖర్ సారథ్యంలో జరిగిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతోపాటు ఉత్తమంగా రాణించిన క్రీడాకారులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ బహూకరించారు. 30 మందిని ఈనెల 6, 7వ తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు వెల్లడించారు. వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, బాబు, శ్రీనివాస్, సాయికృష్ణ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహ సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సత్యారాయణ తెలి పారు. మృతుడి వయసు 30 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. గుర్తుపట్టిన వారు 87126 56508 నంబర్‌కు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని కోరారు. వడదెబ్బతోనే మరణించి ఉంటాడని స్థానికులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..



వినోద (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన లక్కాకుల వినోద(54) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వినోద కొంత కాలంగా తలనొప్పితో బాధ పడుతోంది. ఆస్పత్రులకు వెళ్లి, మందులు వాడినా నయం కాక పోవడంతో జీవితంపై విరక్తి చెంది, గత నెల 25న ఇంట్లో క్రిమిసంహార మందు తాగింది. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బొంతుపల్లి వాసి..

- గత నెల 25న ఆత్మహత్యాయత్నం

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని బొంతుపల్లికి చెందిన చదువు వాసుదేవరెడ్డి (58) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. వాసుదేవరెడ్డికి, బొంతుపల్లికే చెందిన చదువు నరసింహారెడ్డి మధ్య గొడవ లున్నాయి. నరసింహారెడ్డితోపాటు కోరుకంటి శారద, కోరుకంటి ఓదెలు, జునూతుల మనోహర్‌రెడ్డి , జునూతుల మంజుల, కోరుకంటి శంకర్ అతన్ని ఇబ్బందులకు గురిచేయాలనుకున్నారు. శారదకు రూ.5 లక్షలతోపాటు 20 గుంటల భూమి ఇవ్వాలని వాసుదేవరెడ్డితో బలవంతంగా కాగితం రాయించారు. తర్వాత డబ్బులు, భూమి కోసం మానసికంగా వేధించారు. దీంతో మనస్తాపం చెందిన అతను గత నెల 25న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు వినయ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

స్వరాష్ట్ర కాంక్షను రగిల్చిన గీతం

- 'జయ జయహే తెలంగాణ'కు కొత్త వెర్షన్
- స్వాగతించిన సాహితీవేత్తలు
- రాష్ట్ర గీతంగా ఆమోదించిన ప్రభుత్వం
- నేడు ప్రజల ముందుకు..

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ రాష్ట్ర సాధన విజయ గీతిక అయిన జయ జయహే తెలంగాణ అనే పాటను గీత రచయిత అందెశ్రీ రాశారు. ఉద్యమ సమయంలో ఊరువాడా ఏకమై, రాష్ట్ర కాంక్షను ఎలుగెత్తి చాటాయి. ఉద్యమకారుల్లో ఈ పాట నూతన ఉత్సాహాన్ని నింపి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, అందరినీ సంఘటితం చేసింది. 2003 మార్చి 2న కామారెడ్డిలో జరిగిన తెలంగాణ ధూంధాం కార్యక్రమంలో మనకంటూ ఓ పాట ఉండకూడదా అనే ఆలోచన అందెశ్రీకి వచ్చింది. ఆ వెంటనే నాలుగు చరణాలు రాశారు. తర్వాత అదే సంవత్సరం నవంబర్ 11న ఆదిలాబాద్‌లో జరిగిన తెలంగాణ రచయితల వేదిక జెండా వందనంలో వాటిని ఆలపించారు. తెలంగాణ ఘన కీర్తిని ఈ పాటలో పొందుపరచగా 12 చరణాలతో ఉద్యమకారుల నోట చేరి, తెలంగాణ ప్రజల నరనరాన స్వరాష్ట్ర ఆకాంక్షను నింపింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత దీన్ని రాష్ట్ర గీతంగా ప్రకటిస్తామని నాయకులు, ఉద్యమ నేతలు పలు వేదికలపై చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ఆమోదించలేదన్న విషయాన్ని మాజీ సీఎం కేసీఆర్ 2021 మార్చి 16న అసెంబ్లీ సమావేశంలో స్పష్టం చేశారు.

రాష్ట్రం వచ్చిన పదేళ్లకు..

తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పదేళ్ల తర్వాత గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించగా మిత్రపక్షాలు ఆమోదం తెలిపాయి. పాట కొత్త వెర్షన్‌ను సాహితీవేత్తలు స్వాగతించారు. రికార్డింగ్ పూర్తవగా ఆదివారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని, ప్రజల ముందుకు రానుంది. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు తమ మనోభావాలను వెల్లడించారు.

మహత్తర గీతం



రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహత్తర గీతం జయ జయహే తెలంగాణ. పదేళ్లుగా ప్రజల్లోకి రాకుండా బంధించబడింది. ఇప్పుడు అధికారికంగా ప్రకటించడం అ అభినందనీయం. కీరవాణి తెలంగాణేతరుడు అని చెప్పడానికి ఇది తెలంగాణ ఉద్యమ సందర్భం కాదు. రాష్ట్రం వచ్చింది. కీరవాణి స్వర కల్పన చేయడంలో అభ్యంతరం లేదు.

– అన్నవరం దేవేందర్,
కవి, రచయిత, భగత్‌నగర్, కరీంనగర్

ఉద్యమానికి ఊపిరినిచ్చింది



కవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతం తెలంగాణ ఉద్యమానికి ఊపిరినిచ్చింది. ప్రజల్లో స్వరాష్ట్ర కాంక్షను రగిల్చింది. ప్రత్యేక రాష్ట్ర సాధన వైపు అడుగులు వేయించింది. మన ఘనతను ప్రపంచానికి చాటిచెప్పింది. రాష్ట్ర గీతంగా ప్రజల మనోభీష్టానికి ఇచ్చిన గౌరవమిది. చాలా సంతోషంగా ఉంది.

– కొత్త అనిల్‌కుమార్,
కవి, జ్యోతినగర్, కరీంనగర్

నిడివి తగ్గించాలి



రాష్ట్ర గీతం నడివి తగ్గించాలి. ఇందులో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, ఔన్నత్యాన్ని చాటే చరణాలు ఉంటే సరిపోతుంది. పాఠశాలల్లో, సభల్లో గానం చేయడానికి యోగ్యంగా ఉండాలి. నేటి తరానికే కాకుండా భావితరాలకు స్ఫూర్తినిచ్చే అంశాలకు చోటివ్వాలి.

– దాస్యం సేనాధిపతి,
కవి, రచయిత, విమర్శకుడు, కరీంనగర్

సంస్కృతికి అద్దం పడుతుంది



అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతం మన గొప్పదనం, సంస్కృతికి అద్దం పడుతుంది. పండితులు, పామరులను సైతం పరవశింపజేసిన ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించి, ప్రజల్లోకి తీసుకురావడం అందరూ హర్షించాల్సిన విషయం.

– వేములవాడ ద్రోణాచారి,
కవి, రచయిత, రాఘవేంద్ర నగర్, కరీంనగర్

ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చింది



జయ జయహే తెలంగాణ గీతం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చింది. ప్రజాకవి అందెశ్రీ తెలంగాణ ఘనతను చాటుతూ దీన్ని రాశారు. ఉద్యమ నేతలు గుర్తించకున్నా పదేళ్ల తర్వాత అయినా కొత్త ప్రభుత్వం గుర్తించి, రాష్ట్ర గీతంగా ప్రకటించడం అభినందనీయం.

– కేఎస్.అనంతాచార్య,
తెలుగు పండితుడు, మంకమ్మతోట, కరీంనగర్

ఎరుకలగూడెంలో వివాహిత బలవన్మరణం

- వేధించిన వ్యక్తితోపాటు అత్తింటివారిపై మృతురాలి తల్లి ఫిర్యాదు



కల్యాణి మృతదేహం

మంథని: మున్సిపల్ పరిధిలోని ఎరుకల గూడెంలో పర్శవేన కల్యాణి(28) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారెపల్లికి చెందిన మామిడి సమ్మక్క–కొంరయ్యల రెండో కూతురు కల్యాణికి మంథని మండలంలోని ఖానాపూర్‌కు చెందిన పర్శవేన శంకర్‌తో 2013లో వివాహం జరిగింది. వీరు ఐదేళ్లుగా స్థానిక ఎరుకలగూడెంలో నివాసం ఉంటున్నారు. కాగా, కోటపర్తి రవిశ్యామ్ అనే వ్యక్తి కల్యాణికి ఫోన్ ద్వారా పరిచయమయ్యాడు. ఆమెతో ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో ఒకరి జోలికి ఒకరు వెళ్లకుండా పాబందీ రాసుకున్నారు. కానీ, రవిశ్యామ్ గత వారం రోజులు గా ఆమెను మళ్లీ వేధించడంతో పాటు డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. ఈ విషయాన్ని కల్యాణి తన భర్త శంకర్, అత్త రాజమ్మకు చెప్పినా వారు పట్టించుకోలేదు. దీంతో ఆమె శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుంది. తమ కూతురు మృతికి కారణమైన భర్త శంకర్, అత్త రాజమ్మ, కోటపర్తి రవిశ్యామ్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి సమ్మక్క ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు సిరిసిల్ల కేసు

సాక్షి, హైదరాబాద్: కాల్ సెంటర్లో ఉద్యోగం పేరుతో బలవంతంగా సైబర్ నేరాలు చేయించేందుకు ప్రయత్నించిన ముఠాపై సిరిసిల్ల పోలీసులు నమోదు చేసిన కేసు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ అయింది. ఉద్యోగం కోసం కంబోడియాకు వెళ్లిన సిరిసిల్ల యువకుడిని బలవంతంగా సైబర్ నేరాల ముఠాలో చేర్చిన విషయం తెలిసిందే. చైనా దేశస్తుడు సదరు యువకుడికి బలవంతంగా కాల్ సెంటర్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించి భారత మొబైల్ నంబర్లకు కొరియర్ సంస్థ పేరిట కాల్స్ చేసి మోసాలు చేయాలని ఒత్తిడి తెచ్చాడు. మూడు నెలల తర్వాత అక్కడి నుంచి తప్పించుకున్న యువకుడు భారత ఎంబసీ అధికారుల సహకారంతో స్వస్థలానికి చేరుకున్నాడు. ఈ మొత్తం వ్యవహారంపై సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఆ కేసు దర్యాప్తు నిమిత్తం టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ చేసినట్లు ఆ విభాగం డైరెక్టర్ షికా గోయెల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

'భాగ్యనగర్'.. మళ్లీ రద్దు

ఓదెల(పెద్దపల్లి): సికింద్రాబాద్ – సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఫాస్ట్ ప్యాసింజర్ రైలును శనివారం నుంచి రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఈనెల 1, 2, 5, 6, 8, 9వ తేదీల్లో అప్ అండ్ డౌన్.. రెండువైపులా రైలు రాకపోకలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆసిఫాబాద్ – రేచిని రైల్వేస్టేషన్ల మధ్య మూడోలైన్ మరమ్మతుల దృష్ట్యా భాగ్యనగర్ రైలు రద్దు చేస్తున్నట్లు వివరించారు.

గోశాలలో ఆవులు మృతి



యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని గోశాలలో శనివారం మూడు ఆవులు మృతి చెందాయి. శుక్రవారం మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 67 ఆవులు, ఎడ్లను బసంత్‌నగర్ పోలీసులు పట్టుకొని, గోశాలకు తరలించారు. వాటికి టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్షణ కల్పించారు. ఆ జీవాల్లో అస్వస్థకు గురై, అపస్మారక స్థితికి చేరిన పలు ఆవులకు, ఎడ్లకు పశువైద్యులు చికిత్స అందించారు. అయినా, మూడు ఆవులు చనిపోయాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- జమ్మికుంటలోని స్నేహితుడి వద్దకు వచ్చి, వెళ్తుండగా ఘటన
- మృతుడి స్వస్థలం జనగాం జిల్లా గిద్దెబండ తండా



రాకేశ్ (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జనగాం జిల్లా రఘునాథ్‌పల్లి మండలం గిద్దెబండ తండాకు చెందిన దీరావత్ రాకేశ్(17) తన స్నేహితులు లోతు రామ్‌చరణ్, పసుమతి నిఖిల్‌లతో కలిసి జమ్మికుంటలో ఉండే స్నేహితుడి వద్దకు శుక్రవారం బైక్‌పై వచ్చాడు. వీరిలో రామ్‌చరణ్ ఇక్కడే ఉండగా రాకేశ్, నిఖిల్‌లు అదేరోజు రాత్రి తిరుగుపయనమయ్యారు. రాకేశ్ బైక్‌ను అతివేగంగా నడపడంతో హుజూరాబాద్ మండలంలోని రంగాపూర్‌లో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారి స్నేహితులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. బాధితులను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా రాకేశ్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి జనహర్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కాశీకి వెళ్లొచ్చి.. తనువు చాలించి

- ఉరేసుకున్న వృద్ధుడు
- కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో విషాదం

కరీంనగర్‌క్రైం: కాశీకి వెళ్లొచ్చాడు.. అదేరోజు రాత్రి ఉరేసుకొని, తనువు చాలించాడు ఓ వృద్ధుడు. ఈ ఘటన కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో విషాదం నింపింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. గణేశ్‌నగర్‌కు చెందిన మాదూరి భూమయ్య అలియాస్ రమేశ్(70) 30 ఏళ్లుగా ఎల్‌ఎండీ కాలనీలో కిరాణా షాపు నడుపుతున్నాడు. 10 రోజుల క్రితం కాశీకి వెళ్లి, శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. అలసిపోయానని, నిద్రపోతానని చెప్పి, రాత్రి తన గదిలోకి వెళ్లాడు. శనివారం ఉదయం చూసిన కు టుంబసభ్యులకు ఆయన కనిపించలేదు. ఇంటిపైన రేకుల షెడ్డులో చూడగా ఉరేసుకొని కని పించాడు. కాశీ దర్శనం చేసుకున్నాడని, జీవితం ధన్యమైందని, ఇక బతికింది చాలనుకొని, ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భావిస్తున్నట్లు మృతుడి భార్య వినోద తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

రెండు బైక్‌లను ఢీకొన్న ఆటో

- ఐదుగురికి గాయాలు
- కొండగట్టులో మాల విరమణ చేసి వస్తుండగా ఘటన



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రెండు బైక్‌లను ఓ ఆటో ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యా యి. స్థానికులు, పోలీసు ల వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సాల్వాపూర్‌కు చెందిన చిట్యాల గణేశ్ హనుమాన్ మాల వేసుకున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి శనివారం రెండు ద్విచక్రవాహనాలపై కొండగట్టు వెళ్లాడు. మాల విరమణ చేసి, రాత్రి తిరిగి పయనమయ్యారు. తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఎలక్ట్రిక్ గూడ్స్ ఆటో వేగంగా వచ్చి, వీరి వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ రాకేశ్‌తోపాటు గణేశ్, అతని కుటుంబసభ్యులు పూజ, జశ్వంత్, మధులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహన టెక్నీషియన్ ప్రవీణ్, పైలట్ నరేశ్‌లు క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మంగళ్లపల్లిలో ఆది ఆశయ్య (80) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేయగా పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఆశయ్య మృతిపై అనుమానాలున్నాయని ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై ఆంజనేయులును వివరణ కోరగా మృతిపై అనుమానాలను తొగించేందుకే పోస్టుమార్టం కోసం పంపించామన్నారు. ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కిరాణ దుకాణానికి రూ.74,947 కరెంట్ బిల్లు



జగిత్యాల: జగిత్యాల జిల్లా కొండగట్టులో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న చిన్న కిరాణ కొట్టుకు రూ.74,947 కరెంట్ బిల్లు రావడంతో కంగుతిన్నాడు. రమేశ్ అనే వ్యక్తి కొండగట్టులో ఓ గదిని అద్దెకు తీసుకుని కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. మే నెలకు సంబంధించి 168 యూనిట్లే కాలినప్పటికీ రూ.74,947 బిల్లు రావడంతో బెంబేలెత్తిపోయాడు. విద్యుత్ అధికారులను సంప్రదించగా..అంది అంతే అన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు

వేములవాడకు వీకెండ్ తాకిడి



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ: ఎములాడ రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగింది. ఉదయం నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాన్ జయంతి, శనివారం కలిసి రావడంతో వివిధ ప్రాంతాలకు చెందినవారు రాజన్నను దర్శించుకున్నారు. తర్వాత బద్ది పోచమ్మకు బోనం మొక్కు చెల్లించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో రామకృష్ణ, ఏఈవో ప్రతాప రామకృష్ణ, ఇతర అధికారులు పరిశీలించారు.

ప్రభుత్వ విప్ పూజలు

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ప్ర త్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం వే దోక్త ఆశీర్వచనం గావించారు. ఆయన వెంట ము న్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, చందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, రాష్ట్ర మహిళా ప్ర.దాన కార్యదర్శి పాత సత్యలక్ష్మి, నాయకులు కనికరపు రాకేశ్, ధర్మపురి శ్రీనివాస్, సాయి తదితరులున్నారు.

70 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు



నిందుతులు వీరే..

- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్

కరీంనగర్ క్రైం: గంజాయి తరలిస్తూ ముగ్గురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు శనివారం బైపాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కారులో విశాఖ జిల్లా కొమ్మాదికి చెందిన సెరకనం రామకృష్ణ, కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన దొడ్డి మణికంఠ, మహారాష్ట్ర పర్బని జిల్లా భీమ్‌నగర్‌కు చెందిన ధర్మేంద్రకుమార్ అలియాస్ సల్మాన్ అన్సారీలు 70 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసుల విచారణలో ఒడిశా నుంచి మహారాష్ట్రకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకొని, ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు. వారు గంజాయి ఎవరి వద్ద కొనుగోలు చేశారు.. ఈ దందా ఎన్ని రోజులుగా కొనసాగిస్తున్నారు.. తదితర అంశాలపై లోతుగా విచారణ చేపడతామన్నారు. నిందితులను పట్టుకున్న వన్‌టౌన్ సీఐ సరిలాల్, ఎస్సై స్వామి, సిబ్బందిని అభినందించారు.

కొట్టి, డబ్బులు కాజేసిన ఏడుగురి అరెస్టు

జగిత్యాల క్రైం: కారు అద్దె డబ్బులు అడిగిన వ్యక్తిని కొట్టి, అతని అకౌంట్‌లోని రూ.46 వేలను కాజేసిన ఏడుగురిని అరెస్టు చేసినట్లు జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన నక్క అజయ్ కార్లు అద్దెకిస్తుంటాడు. పెగడపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన బొల్లారపు సురేశ్ అతని వద్ద కారు అద్దెకు తీసుకున్నాడు. కానీ, డబ్బులివ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. మార్చి 5న అజయ్ సురేశ్‌కు ఫోన్ చేయగా డబ్బులిస్తానని, జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఉండమని చెప్పాడు. దీంతో అజయ్ అక్కడికి వెళ్లాడు. నంబర్ లేని కారులో బొల్లారపు సురేశ్, అతని మిత్రులు ఆరెల్లి సునీల్, ఎరెల్లి సాగర్, రాధ నవీన్, తరాల శ్రీకాంత్, ఆరె రాకేశ్, మంత్రి విజయ్‌లు వచ్చి, అతన్ని బలవంతంగా కారులో ఎక్కించుకొని వెళ్లారు. అజయ్‌ని కొట్టి, చంపుతామని బెదిరించడంతోపాటు అతని ఫోన్ నుంచి ఫోన్ పే ద్వారా రూ.46 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. జగిత్యాలలో దింపి, వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం జగిత్యాల బట్టివాడ, పెగడపల్లి మండలం లింగాపూర్‌లో ఆ ఏడుగురిని అరెస్టు చేసి, రూ.8,800 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

వెల్గటూర్‌లో దొంగల బీభత్సం

- అర్ధరాత్రి ఐదిళ్లలో, ఒక షాపులో చొరబడిన వైనం
- బంగారం, వెండి, నగదు చోరీ



చిందరవందరగా బీరువాలోని దుస్తులు

వెల్గటూర్ (ధర్మపురి): వెల్గటూర్ మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకేరోజు ఐదిళ్లతోపాటు ఒక షాపులో చొరబడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి దాటాక దుండగులు తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేసి చోరీలు చేశారు. బెస్తవాడకు చెందిన గుమ్ముల నరేశ్ ఇంట్లో చొరబడి, 4 తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.5 వేలు ఎత్తుకెళ్లారు. అతను ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లగా, భార్య వేసవికాలం కావడంతో పిల్లలను తీసుకొని, పుట్టింటికి వెళ్లింది. అలాగే, జోగం చిలుకలయ్య, ధర్మాజి లింగన్న, తూపుకారి శివాజీ, మరుపాక విష్ణు ఇళ్లలోనూ చోరీకి ప్రయత్నించారు. శివాజీకి చెందిన బైక్‌ను దొంగిలించేందుకు విఫలయత్నం చేశారు. ఆ వాహనంలో పెట్రోల్ లేకపోవడంతో కొంత దూరంలోని పొలాల్లో పడేసి, వెళ్లిపోయారు. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని రాష్ట్ర రహదారి పక్కన ఉన్న శ్రీవేంకటేశ్వర ఆటో మొబైల్ షాపులోని సామగ్రిని చిందరవందరగా పడేశారు. అందులో ఏమీ దొరక్కపోవడంతో సీసీ టీవీ డీవీఆర్ బాక్స్‌ను ఎత్తుకెళ్లారు. పోలీసులు శనివారం సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ పేర్కొన్నారు. పోలీసులు నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తు న్నా కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. వరుస ఘటనలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాళం వేయకుండా ప్రజలెవరూ బయట పడుకోకూడదని, అనుమానాస్పద వ్యక్తులు కని పిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.